# సన్మానం

-కె.యస్.ఇందిరా ప్రియదర్శిని

ఆ రోజు ఉదయం వచ్చిన ఉత్తరాన్ని చూశాక రవికి ఆశ్చర్యమేసింది. పిచ్చుకపాళెం సాహితీ సమాఖ్యవారు తనకు ఉగాది సందర్భంగా సన్మానం చేయదలచినట్టు, తన అంగీకారాన్ని కోరుతూ రాశారు.

రవి పెద్ద రచయితేం కాడు. ఏదో అప్పడొకటీ అప్పడొకటీ కథలు రాస్తూంటాడు. వాటిలో ఒకటీ, అరా పత్రికలలో ప్రచురితమైనదీ నిజమే. కథలను మెచ్చుకొంటూ అతనికి ఎవరూ ఉత్తరాలు రాసింది లేదు. పత్రికలలోనూ అలాంటి ఉత్తరాలు ప్రచురింపబడలేదు సరికదా, కథ పరమచెత్తగా ఉందంటూ, ఇలాంటి కథలు ప్రచురించి ఎందుకు పత్రిక పేరు చెడుపుకుంటారంటూ ఎడిటర్‌లను దుయ్యబడుతూ రాసిన ఉత్తరాలు మాత్రం ప్రత్యేకమైన 'బాక్స్'లలో ప్రచురితమయ్యాయి.

ఆ దెబ్బతో భయమేసి ఈ మధ్య కథలు ఎక్కువగా పత్రికలకు పంపించడం లేదన్నది వాస్తవం. ఒకటికి పదిసార్లు చదివి, తన మనస్సుకు నిజంగా బావుందని తోస్తేనే పంపిస్తున్నాడు. కనీసం భార్య అయినా చదివి తన అభిప్రాయం చెబుతుందేమోనని ఒకసారి అడిగితే ఆమె కంటనీరు పెట్టుకుంది.

"మన పెళ్లయిన ఇన్నేళ్లుగా నేను ఏనాడైనా మీ మనస్సుకు బాధ కలిగించేలా ప్రవర్తించానా? నేనుగానీ, మా వాళ్లుగానీ మీకు ఏం ద్రోహం చేశామని నన్ను ఇలా మీ కథలను చదవమని బాధపెడుతున్నారు?'' అంది కళ్లు తుడుచుకుంటూ.

అదిరిపోయిన రవి ఆ తరువాత ఎప్పుడూ ఆమెను బాధపెట్టలేదు. తనే చదివి బావుందని తోస్తేనే పంపిస్తున్నాడు.

అలా చేసీ పది కథలు పంపితే, తొమ్మిది కథలు భద్రంగా తిరిగి వస్తున్నాయి. అలాంటప్పుడు ఈ పిచ్చుకపాళెం సాహితీ సమాఖ్య వారి దృష్టిలో తాను ఎలా పడ్డాడో, తనకు సన్మానం చేయాలనే ఉద్దేశం వాళ్లకెలా కలిగిందో అర్థంకాక ఆ రోజంతా మధనపడుతూనే ఉన్నాడు.

"ఇది ఎలా జరిగిందో నీకేమైనా అర్థమవుతోందా లక్ష్మీ?'' అని అర్థాంగిని అడిగాడు.

వరలక్ష్మి దీర్ఘంగా ఆలోచించింది.

"మీరేమీ అనుకోకుంటే నాకు తోచింది చెప్పనా?'' అంది నవ్వు నాపుకుంటూ.

ఆ నవ్వు చూసినప్పుడే పుల్లవిరుపుగా ఏం అంటుందోనని భయపడుతూనే, "సరే. చెప్పు'' అన్నాడు.

"ఈమధ్య మీ కథలు ఎక్కువగా పత్రికలలో రావడం లేదు కదా! అందుకు సంతోషించి ఈ సన్మానం చేస్తున్నారేమోనండీ!'' అంది సీరియస్‌గా.

రవి మొహం రంగులుమారింది.

"అలా అనుకుంటే నా కథలు ఎక్కువగా ప్రచురించని ఎడిటర్‌లకు కదా సన్మానం చేయాలి? నేను రాస్తూనే ఉన్నాను కదా!'' అన్నాడు కినుకగా.

"అవుననుకోండి. కానీ మీరు ఎన్ని రాసి పంపిస్తున్నారో వాళ్లకు తెలియదు కదా! ప్రచురింపబడటం లేదు కాబట్టి మీరు రాయటం తగ్గించారు అని పొరబడి ఉంటారు. పోనివ్వండి. సన్మానం చేస్తున్న వాళ్లకే లేని సిగ్గు చేయించుకునే వాళ్లకెందుకు? అంగీకరిస్తున్నట్టు రాసేయండి'' అంది మరింత దెబ్బతీస్తూ.

రవి మొహం గంటుపెట్టుకున్నాడు.

* * *

మరుసటిరోజు మిత్రుడు రాజా రాసిన ఉత్తరం చూశాక రవి సందేహానికి జవాబు దొరికింది. రాజా ఒక దినపత్రికలో విలేఖరిగా పనిచేస్తున్నాడు. నిజానికి చదువుకునే రోజుల నుండీ కూడా రాజాకు తెలుగులో ఒక వాక్యం కూడా తప్పులు లేకుండా రాయడం రాదు.

అటువంటివాడు తెలుగు పత్రికా విలేఖరి కావడం వాడి అదృష్టమో, ఆ పత్రికాధిపతుల ప్రారబ్ధమో రవికి అర్థం కాలేదు.

పిచ్చుకపాళెం సాహితీ సమాఖ్య కార్యదర్శి తనకు చాలా ఆప్తమిత్రుడనీ, ఈ సన్మాన కార్యక్రమానికి రవి పేరును సూచించింది తానేననీ, తప్పక అంగీకరించమనీ, ఇటువంటి కార్యక్రమాల ద్వారా రవికీ ఒక గుర్తింపు వచ్చే అవకాశం ఉందనీ రాశాడు రాజా.

అంగీకరించక తప్పలేదు రవికి.

* * *

రచయితగా అతనన్నా, అతని కథలన్నా వరలక్ష్మికి చిన్నచూపేగానీ, సన్మానం అనేసరికి అదేదో చూడాలనిపించి తానూ కూడా వస్తానని పట్టుబట్టింది. తప్పేదేముంది? ఇద్దరూ బయలుదేరారు.

పిచ్చుకపాళెం అంటే అదేదో కుగ్రామం అనుకునేరు! అది ఓ మోస్తరు చిన్నటౌను.

రవిని తీసుకెళ్లటానికి ఆ సాహితీ సమాఖ్య కార్యదర్శి వచ్చాడు. నవ్వు మొహంతో తనను తాను పరిచయం చేసుకున్నాడు. అతని పేరు శరత్.

"రాజా వచ్చాడా?'' అడిగాడు రవి.

"లేదండీ. మధ్యాహ్నానికల్లా వచ్చేస్తానన్నారు'' అన్నాడతను.

హోటల్లో రూమ్ ఏర్పాటు చేయాలనుకున్నారట రవికి. కానీ, అతను సతీసమేతంగా విచ్చేయడం వలన తమ ఇంటికే రావలసిందనీ, అక్కడైతే ఆడవారికి ఏ ఇబ్బందీ ఉండదని చెప్పి తమ ఇంటికి తీసుకెళ్లాడు శరత్.

ఇల్లు చేరాక కాఫీలూ అవీ కానిచ్చి, తీరుబడిగా కూర్చున్నారు.

సాయంత్రం కార్యక్రమం గురించి వివరంగా చెప్పాడు శరత్. ఎమ్మెల్యేగా మూడుసార్లు పోటీ చేసి ఓడిపోయిన పార్టీ నాయకుడొకాయన అధ్యక్షత వహించడానికి అంగీకరించాడట. సన్మాన కార్యక్రమం తరువాత నాటక ప్రదర్శన కూడా ఉందనీ, అంతా ఆ ఊళ్లో యువకులే చేస్తున్నారనీ చెప్పాడు.

తనూ కథలు రాస్తాడనీ, వాటిని చదివి అభిప్రాయం తెలుపమనీ చెప్పి, ఒక కాగితాల బొత్తు తెచ్చి ఇచ్చాడు అవి చదువుతూండగానే మరో అయిదారు మంది యువకులు 'పోలో'మంటూ వచ్చారు. వాళ్లందరూ సాహితీ సమాఖ్య సభ్యులేనట. అందరూ కథలూ, కవితలూ రాయాలని తెల్లకాగితాలను ఖరాబు చేసేవారే.

వాళ్ల మాటలు విన్నాక రవికి ఒక విషయం అర్థమయింది. కథలు ప్రచురించబడాలంటే ఆ రచయితకు ఆయా పత్రికాధిపతులతో లేక ఎడిటర్లతో పరిచయం ఉండటమో, లేక వేరే ఎవరి సిఫార్సైనా ఉండటమో ముఖ్యం అని ఆ



యువకులందరికీ ఒక దురభిప్రాయం ఉన్నట్టుంది. రవి ఏదో పెద్ద రచయిత అనీ, అతనికి అలా అన్ని పత్రికాధిపతులతోనూ పరిచయం ఉంటుందనీ వాళ్లు అనుకొంటున్నారు. అందరూ వాళ్లు రాసిన కథలూ, కవితలూ పట్టు కొచ్చి రవి ముందు పడేశారు.

వీటన్నిటికీ వెనుక రాజా హస్తం ఉండి ఉంటుంది. తానేదో గొప్ప రచయిత నని రాజా వీళ్లకు గొప్పగా చెప్పి ఉంటాడు.

రవి గంభీరంగా ఫోజు పెట్టి ఆ కాగితాలను తిరగేయసాగాడు. అతను చదివి పక్కన పెట్టిన కథలను వరలక్ష్మి శ్రద్ధగా చదువుతూ ఉంది.

"ఏమండీ! ఇవన్నీ చదివితే మీకేమనిపిస్తోంది?" అని అడిగింది.

"ఏముందీ! కొత్తగా రాయడానికి చేసే ప్రయత్నం ఇది. భాష విషయంలో గానీ, చెప్పదలచిన దానిని చెప్పవలసిన పద్ధతిలో కానీ ఇంకా పరిపక్వత ఏర్ప డలేదు. ఇంకా బాగా శ్రమించాలి" అన్నాడు గంభీరంగా భార్యను చూస్తూ.

"ఏడిసినట్టుంది. నన్నడిగితే తిరిగి వచ్చిన మీ కథలన్నిటినీ వీళ్ల చేతికిస్తే వాటిని ఇంకా చక్కగా తిరగరాయగలరేమోననిపిస్తోంది నాకు" అంది వరలక్ష్మి ఎగతాళిగా.

రవి మొహం మాడ్చుకున్నాడు.

మధ్యాహ్నం భోజనాలకు ముందే రాజా వచ్చేశాడు.

"రాజా! ఏమిట్రా ఇదంతా? వీళ్లనంతా నా మీదికి తోలేశావేమిటీ?" అన్నాడు రవి.

"ష్! అదంతేలే, ఊరుకో!" అని నోరు మూయించేశాడు రాజా.

## ఈ మేకపోతు మాంసాహారి

వారణాసిలోని రాజఘాట్‌లో పడవ నడిపే రమేష్ మహజీ దగ్గర పదేళ్ళ తెల్లమేక ఉంది. ఎవరో భక్తుడు గంగనీళ్ళతోపాటు ఈ మేకని మహ జీకి దానమిచ్చాడట. దానికి బైజు బాబ్రా అని పేరు పెట్టాడతను. అయితే, ఇది ఆకులు అలములు తినదు. దానికి చేపల వేపుడు, కోడిమాంసం కావాలి. వాటితోపాటు నాటుసారా దగ్గర్నుంచి ఫారెన్ విస్కీ దాకా అన్నీ తాగుతుంది. రమేష్ పేకాట మిత్రులంతా దాని విన్యాసాలు చూసి తెగ ముచ్చటపడుతుంటారు. ఏ రోజునైనా దానికిష్టమైన చేపలవేపుడు పెట్టక పోతే తన కొమ్ములతో కుమ్మి రాద్ధాంతం చేస్తుందిట.

## పరీక్ష రికార్డులు

రాజస్థాన్ కోహరీ గ్రామానికి చెందిన శివచరణ్ 1969 నుంచి ప్రతి యేటా టెన్తు క్లాసు పరీక్షకి కూర్చుంటున్నా 38 ఏళ్ళుగా పాసవటం లేదు. టెన్త్ పాసయితే కాని పెళ్ళి చేసుకోనంటున్న ఈ 73ఏళ్ళ బ్రహ్మచారి వచ్చే యేడు కూడా పరీక్ష వ్రాస్తానంటున్నాడు. ఇన్నేళ్ళకి ఈయేడు సాధించిందే మిటంటే సంస్కృతంలో పాసుకావటం! మరోవైపు జైపూర్‌కి చెందిన 11 ఏళ్ళ దీపికా శర్మ అనే పిల్ల అతి చిన్న వయస్సులో ఫస్టుక్లాసులో టెన్తు పాసయి రికార్డు స్థాపించింది.

-టి.ఆర్.ఆర్




***

సాయంత్రం సభ అట్టహాసంగా మొదలైంది. ప్రారంభమైన పావుగంటకే విద్యుచ్ఛక్తికి అంతరాయం కలగడం, కర్టెన్లు సరిగా పనిచేయకపోవడం అన్నీ చాలా అవాంతరాలు జరిగాయి.

రావడమే ఆలస్యంగా వచ్చిన రాజకీయ నాయకుడు, వచ్చీ రావడంతోటే "నేను ఈ రోజే అర్జెంటుగా అయిదరాబాదు ఎల్లాలి. పార్టీ మీటింగుంది. తొంద రగా కానీండి" అని నసపెట్టడం ప్రారంభించాడు.

అధ్యక్షోపన్యాసం నిమిత్తం ఆయన ముందు మైకు సర్దిపెట్టారు.

"ఈ కార్యక్రమానికి రావడం నాకు నిజంగా సంతోషంగా ఉంది. ఈన...పేరేంటి...(ప్రక్కన ఉన్న శరత్‌ను అడిగి తెలుసుకొని) ఆ... రవిగారు గొప్పరచయిత. ఈయన్ని సన్మానించడం అంటే మనల్ని మనమే సన్మానించు కోవడమేనన్నమాట. ఈన కథలు నేను చదవలేదుగానీ చాలా గొప్పగా రాస్తా డని అన్నాను. ఈన 'తెలుగు గోడు' ('తెలుగోడు' అన్న పేరుకు వచ్చిన తిప్పలు), 'తెలుగు కొయ్యలు' (తెలుగు హొయలు) లాంటి బాల పత్రికలలో కథలు రాసి యువ రచయితలకు కూడా రాయాలనే తపన కలుగజేస్తూ ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపుతున్నారని చెప్పడానికి సంతోషిస్తున్నాను. కతలు రాయడం తెలుగు తల్లికి మనం చేసే సేవగా మనం భావించాలి. ఈ సాహితీ సమాఖ్యలోని ప్రతీ ఒక్కరూ ఈనలాగే కతలూ, గట్రా రాసి మంచి పేరు సంపాదించాలని కోరుకుంటున్నాను. నేను అరిజెంటుగా అయిదరా బాదు ఎల్లాల్సి ఉంది కాబట్టి ఇంతటితో సాలిస్తావున్నాను" అని మాట్లాడి, "పదయ్యా, సెగట్రీ! ఆ సన్మాన కారెక్రమం యేదో తొందరగా సూడు" అన్నాడు.

శరత్, ఇంకో నలుగురు యువకులు హడావుడిగా స్టేజిపైకి వచ్చారు. ఒక పెద్ద కుర్చీ వేసి రవిని కూర్చోబెట్టారు.

"ఈ 'క్యాసెట్'లో 'బి' సైడు మంగళవాద్య గానం ఉంది. క్యాసెట్‌ను అలాగే ఉంచి టేప్‌రికార్డరు ఆన్ చేయండి" అని ప్రక్కనున్న యువకులకు క్యాసెట్‌ను అందించాడు శరత్.

ఒక పెద్ద పళ్లెంలో చందనం తాంబూలాదులు, శాలువా మొదలైనవి పెట్టి తెచ్చి ఆ రాజకీయ నాయకుని పక్కన నిలబడ్డాడు.

"మొదట ఆయన చేతులకు గంధం పూయండి" అన్నాడు.

ఆయనకు పళ్లెంలో గంధం గిన్నె ఏదో, పసుపు గిన్నె ఏదో తెలియలేదు, పాపం!

పసుపు తీసి రవి చెంపలకూ, చేతులకూ రాశాడు.

"ఇక గాజులు తొడగడం ఒకటే తరువాయి" అని కసిగా అనుకున్నాడు రవి.

నుదుట తిలకం దిద్ది, శాలువా కప్పబోతుండగా టేప్‌రికార్డరు మ్రోగడం మొదలైంది.

'కడుపు చించుకు పుట్టిందొకరూ
కాటికి నిన్ను మోసేదొకరూ
తలకు కొరివి పెట్టేదొకరూ
ఆపై నీతో వచ్చేదెవరూ'

అని ఘంటసాలగారి కంఠం వినిపించింది. రవి మొహం కందగడ్డలా ఎర్ర బడింది.

"ఆపండాపండి. 'బి' సైడు అని చెప్పానుగా! 'ఏ' సైడు పెట్టారెందుకూ?" అని అరుస్తున్నాడు శరత్.

అతను అరిచేది ఎవరికీ వినిపించలేదు. గత్యంతరంలేక అతనే వెళ్లి ఆఫ్ చేశాడు.

రవికి శాలువా కప్పాక అతని చేతికి ఒక కవరు తాంబూలంతోబాటు అందిస్తూ, "రచయితగారు మేము సమర్పిస్తున్న ఈ వేయీ నూట పదహార్లనే పదివేల నూట పదహార్లుగా భావించాలని అర్థిస్తున్నాము" అన్నాడు శరత్.

రవి వాటిని చిరునవ్వుతో అందుకున్నాడు. ప్రేక్షకుల వైపు చూస్తే నలుగురికి మించి లేరు.

అందులో ఒకరు తన భార్య, ఇంకొకరు తన మిత్రుడు రాజా. నాటకానికి ఇంకా టైముంది కదా అని అందరూ అటూ ఇటూ వెళ్తున్నారు.

***

రవి దంపతులను బస్సు ఎక్కిస్తూ, "రేపు మా ఢంకా పత్రిక చూడు. ఫోటో, వార్త పంపిస్తున్నాను" అన్నాడు రాజా.

బస్సులో తీరిగ్గా కూర్చున్నాక "ఆ కవరులో ఏముందో చూడండి" అంది వరలక్ష్మి.

రవి కవరు విప్పి చూశాడు.

అందులో ఒక నూరు రూపాయల నోటూ, ఒక పది రూపాయల నోటూ, ఒక అయిదు రూపాయల నోటూ, తాకాలంటేనే భయం వేసేలా ఉన్న ఒక పాత ఒక రూపాయి నోటూ, వీటితోపాటు ఒక చిన్న ఉత్తరమూ ఉన్నాయి. కాగితం మడత విప్పాడు.

"అయ్యా! మీ బోటివాళ్ల సహకారంతో ఏదో చేయాలని ఉత్సాహమైతే ఉందిగానీ, మా సాహితీ సమాఖ్యకు ఆర్థిక వనరులు ఏవీ లేవు. ఉన్న సభ్యులందరూ నిరుద్యోగులే. ఏమీ అనుకోక ఈ నూట పదహార్లనే వేయినూట పదహార్లుగా భావించాలని మనవి. మేమేదో మోసం చేశామని తిట్టుకోకండి. రాజా గారి సలహా ప్రకారమే ఇలా చేశాము" అని రాసి ఉంది.

"ఏడిసినట్టుంది. వేదికపైనేమో వేయి నూటపదహార్లనే పదివేల నూట పదహార్లుగా అనుకోమన్నారు. ఇప్పుడేమో ఈ నూటపదహార్లనే వేయి నూటపదహార్లుగా అనుకోమంటున్నారు" అంది వరలక్ష్మి ఈసడింపుగా.

రవి నోట మాటే రాలేదు.

***

మరునాడు పెద్దగా ఉత్సాహం లేకపోయినా ఓపికగా వెళ్లి 'ఢంకా' దినపత్రిక కొనుక్కొచ్చాడు రవి.

సన్మానం జరిగినప్పటి ఫోటో ప్రచురించారు. అందులో సన్మానం చేస్తున్న నాయకుని ఫోటో పూర్తిగా, స్పష్టంగా ఉంది. రవి చేతులూ, భుజాలూ మాత్రమే కనిపిస్తున్నాయి.

వార్త చదివాడు.

"ప్రముఖ రచయిత రవిగారికి పిచ్చుకపాళెం సాహితీ సమాఖ్య వారు చేసిన సన్మానం సందర్భంగా శ్రీ.....గారి అధ్యక్షోపన్యాసంలో ఆయన తెలుగు తల్లికి అందరూ తగిన సేవను చేయాలనీ, ఆంగ్ల పత్రికలలోనూ తెలుగు కథలు ప్రచురించబడాలనీ సూచించారు. ఆదిలో సన్మాన కార్యక్రమానికి కొన్ని అంతరాయాలు కలిగినా, అంత్యక్రియలు మాత్రం బ్రహ్మాండంగా జరిగాయి......" రాజాగాడు వాడి తెలుగు పాండిత్యమంతా ఆ వార్తను రాయడంలో కనబరిచాడు.

పాలిపోయిన మొహంతో వరలక్ష్మి వైపు చూశాడు రవి.

ఆమె మొహం చిటపటలాడుతూ ఉంది.

"ఆ రాజాగాడు చిన్నప్పటి నుండీ అంతే. తెలుగులో చాలా పూర్. కార్యక్రమంలో చివరి భాగం అని రాయడానికి అలా రాశాడు. పూర్వభాగాన్ని 'పూర్వ క్రియలు' అనీ, తరువాత భాగాన్ని 'ఉత్తర క్రియలు' అనీ రాయాలి. వాడికి అంత పరిజ్ఞానం ఉంటేగా!" అన్నాడు ఏదో సర్దిచెబుతున్నట్టు.

"ఏమిటీ! ఉత్తరక్రియలా! దానికన్నా అంత్యక్రియలే నయం. అంత్యక్రియల తరువాతే కదా ఉత్తర క్రియలు జరిగేది!" అని ఉరిమింది వరలక్ష్మి.

"వెధవ కథలూ, వెధవ సన్మానాలూ! ఇకనైనా మీ కథారచనకు అంత్యక్రియలు చేసేసి, మీరూ, మీ మిత్రుడూ కలిసి ఎవరి దగ్గరైనా తెలుగు బాగా నేర్చుకోండి. భాష నేర్చుకున్నతరువాత మీ సన్మానాలు ప్రారంభిద్దురుగానీ!" అంది.

రవి తలొంచుకున్నాడు.

★



## కమలినీ నమ్మకం

తొలి చిత్రం 'ఆనంద్'తో అటు సినీ పరిశ్రమను, ఇటు ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకున్న బెంగాలీ భామ కమలినీ ముఖర్జీ 'గోదావరి' చిత్రంతో యువతరం అభిమానాన్ని సంపాదించేసుకుంది. 'క్లాస్‌మేట్స్' ఆమెను నిరుత్సాహానికి గురి చేసినా ఇవివి దర్శకత్వంలో నిర్మాణమవుతున్న 'ఫెళ్లయింది కానీ...' చిత్రం తనకు మంచి పేరును తీసుకొస్తుందని నమ్మకంగా చెబుతోంది. ఆల్ ది బెస్ట్ కమలినీ

